# ఆరో అల్లుడు

నిఖా జరుగుతోందక్కడ . . .

దుల్హన్ పదహారేళ్ళ యాస్మిన్ – లేత గులాబీ మొగ్గలా వికసించీ వికసించని పరువం – బుగ్గల్లో మెరిసే పసితనపు నిగారింపు – కళ్ళల్లో విరిసే అమాయకత్వపు గుబాళింపు.

దూరంగా నిలబడి – నిరాశలో నలిగిపోతూ నేను. నా స్వంతం అనుకున్నది నాది కాకుండా పోతోందన్న దిగులు – నేను ప్రేమించిన రాకుమారిని ఒంటికొమ్ము రాక్షసుడు బలవంతంగా లాక్కెళ్ళిపోతున్న భావన – నా ప్రాణాన్ని ఏడు సముద్రాల అవతల ఏ గుహలోనో పంజరంలో చిలకలా చేసి బంధిస్తాడన్న భయం.

యాస్మిన్‌కి సంబంధాలు చూస్తున్నారని తెలిసి, మనసు వికలమై, చివరికి ధైర్యం చేసి అమ్మతో చెప్పాను – నాకు యాస్మిన్‌ని పెళ్ళి చేసుకోవాలనుందని.

వినకూడని విషయమేదో విన్నట్లు అమ్మ నా వైపు వింతగా చూసిందో క్షణం – వెంటనే తేరుకుని "నీకు నిండా పద్దెనిమిదేళ్ళు లేవు. అప్పుడే పెళ్ళేమిట్రా అమీర్" అన్నప్పుడు నేనూ ఆమె వైపు వింతగా చూశాను. "యాస్మిన్‌కి పదహారు నిండకుండానే పెళ్ళి చేయాలనుకుంటున్నప్పుడు పద్దెనిమిదేళ్ళకే నేనెందుకు పెళ్ళిచేసుకోకూడదూ" అన్నాను.

అమ్మ నవ్వింది. "అదంటే ఆడపిల్ల – ఎన్నాళ్ళని ఇంట్లో పెట్టుకుంటారు? మంచి సంబంధం వస్తే పెళ్ళి చేసి పంపించాలనే కోరుకుంటారు."

'మనది మంచి సంబంధం కాదా అమ్మీజాన్' అని అడగబోయి, అమ్మను ఇబ్బంది పెట్టటం ఇష్టంలేక వెల్డింగ్ షాపు కెళ్ళిపోయాను.

ఆ రోజంతా ఎంతటి క్షోభను అనుభవించానో ఆ అల్లాకే తెలుసు. పనిలో మనసే లగ్నం కాలేదు. అమ్మ అడిగిందో లేదో? అడిగితే ఏమన్నారోలాంటి సవాలక్ష ప్రశ్నలు మనసులో నిప్పురవ్వల్లా ఎగిరిపడుతూ . . . ఖాన్ చాచాదీ, మాదీ పక్క పక్క ఇళ్ళు. మా నాన్న నా పన్నెండో ఏట చనిపోయాక మాకు పెద్ద దిక్కుగా, మా మంచిచెడ్డల్ని పట్టించుకున్న ఖాన్ చాచా అంటే నాకు గౌరవం. ఖాన్‌చాచాకున్న ఎనిమిది మంది సంతానంలో యాస్మిన్ మొదటిది.

పదేళ్ళ క్రితం యాస్మిన్‌ని మొదటిసారి స్కూలుకు పంపుతూ వాళ్ళ అమ్మీజాన్ అన్నమాటలు నాకింకా గుర్తు – "అమీర్ బేటా – ఇక నుంచి యాస్మిన్ బాధ్యతంతా నీదే. జాగ్రత్తగా పిల్చుకెళ్ళి, వచ్చేప్పుడు భద్రంగా పిల్చుకుని రావాలి. నీ జాన్‌లా చూసుకోవాలి" అన్నప్పుడు ఐదేళ్ళ యాస్మిన్ తన విశాలమైన కళ్ళతో నా వైపు ఆత్మీయంగా చూసి – నా చిటికెన వేలిని పట్టుకుని స్కూలుకు నడవడం నేనెన్నటికీ మరువలేను.

ఆ రోజు సాయంత్రం ఆరాటంగా ఇంటికెళ్ళాను. అమ్మ విచారవదనం సగం జవాబు చెప్పినా ఆశ చంపుకోలేక అడిగాను.

"వాళ్ళ పిల్లని వెల్డింగ్ షాపులో పనిచేసే కుర్రాడికెందుకిస్తారు బాబూ? యాస్మిన్ బంగారుబొమ్మలా ఉంటుంది. ఓ అమీర్ సంబంధం చేసి ఆ విధంగానైనా మిగతా ఏడుగురు పిల్లల చదువులూ, పెళ్ళిళ్ళూ జరుపుకోవాలని ఆశపడ్తున్నారు" ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరగటం నాకు లీలగా కన్పించింది.

ఖాన్ చాచాది మాకు మల్లేనే పేద కుటుంబం. ఐదుగురు ఆడపిల్లలు–ముగ్గురు మగపిల్లలు. ఖాన్‌చాచా వాచ్‌మన్‌గా పనిచేసి సంపాయించే రెండు వేలతో పది మంది కడుపులు నిండాలి. తనలా తన కూతురు దరిద్రం అనుభవించకూడదని ప్రతి తండ్రీ కోరుకుంటాడు. తమ కన్నా ఎక్కువ హోదా ఉన్న ఇంట్లోనే ఆడపిల్లని ఇవ్వాలనుకోవడంలో తప్పేముందీ?

ఉర్దూ మీడియంలో ఏడో తరగతి వరకూ చదువుకున్న నన్ను ఖాన్‌చాచాయే వెల్డింగ్‌షాపులో పనికి పెట్టించాడు. అలా వచ్చే కూలి డబ్బుల్తో అమ్మను పోషించుకోవటమే కష్టంగా ఉంటే, నన్ను చేసుకుని యాస్మిన్ ఏం సుఖపడ్తుంది?

ఇలా ఆలోచించుకుని నాకు నేను సమాధానపడ్డాను తప్ప పరిస్థితి మరీ ఇంత దుర్భరంగా, దుస్సహంగా ఉంటుందని ఊహించనైనా లేదు.

ఏదో కోలాహలం–ఆలోచనల్లోంచి బైటపడి చూశాను. ఖాజీ, సాక్షులూ మసీదులో ఉన్న పెళ్ళి కొడుకుని 'దుల్హాన్ కబూల్ హైక్యా' అని మూడుసార్లడిగి 'కబూల్‌హై' అన్పించుకుని యాస్మిన్‌ని అంగీకారం అడగడానికొచ్చారు.

ఏదైనా అద్భుతం అంటూ జరిగితే ఇప్పుడే జరగాలని మనసు ఆశపడ్తోంది. పెళ్ళింకా పది రోజులుందనగా – ఎవ్వరూ దరిదాపుల్లో లేరని నిర్ధారించుకుని యాస్మిన్‌తో చెప్పాను 'వాణ్ణి పెళ్ళి చేసుకోనని చెప్పు. నిఖా నీకు కబూల్ కాదని చెప్పు. మనిద్దరం పెళ్ళి చేసుకుందాం' అని. తన విశాలమైన కనురెప్పల్ని ఓ క్షణం పైకెత్తి, విస్మయంగా నా వైపు చూసి, అతి నెమ్మదిగా కళ్ళను దించేసి, తలవొంచుకుని, సమాధానం చెప్పకుండా వెళ్ళిపోయిందా రోజు.

ఈ పది రోజులూ యాస్మిన్ ప్రశాంతంగా ఆలోచించుకుని ఓ నిర్ణయానికొచ్చి ఉంటుంది. ఇప్పుడు వీళ్ళు 'కబూల్ హైక్యా' అని అడగటమే తరువాయి 'నహీ' అని పెద్దగా అరచి పాకీజా సినిమాలో మీనాకుమారిలా పరుగెత్తుకుంటూ నా దగ్గరికొస్తుందన్న పిచ్చి ఊహ.

ఖాజీ, సాక్షులూ యాస్మిన్ వద్దకెళ్ళి నిలబడ్డారు. యాస్మిన్ ఎర్రటి చీరలో ముడుచుకు కూచున్న అగ్ని పుష్పంలా ఉంది. నేను వళ్ళంతా చెవులు చేసుకుని ఆ గడప దగ్గర నిలబడ్డాను. 'మెహర్ ఏ ముఅజ్జల్ పచీస్ హజార్ సే దూల్హా కబూల్‌హైక్యా' అని అడిగారు. నా గుండెని తూట్లు పొడుస్తూ, 'కబూల్‌హై' అని తీయటి మంద్రమైన స్వరం విన్పించింది.

నాకు దుఃఖం ఆగింది కాదు .ఆమె బదులు నేనే 'నహీ' అని అరవాలనిపించింది. ఉబుకుతున్న కన్నీళ్లు ఎవ్వరూ చూడకుండా మా ఇంట్లోకెళ్ళిపోయాను.

జల్వా జరుగుతోంది రమ్మంటే అయిష్టంగానే బైటికొచ్చాను.

పెళ్ళి కొడుకునీ, పెళ్ళికూతుర్ని ఎదురెదురుగా కూచోబెట్టారు. ఎర్రటి మేలిముసుగులో ఒదిగిన గులాబీ రేకుల కుప్పలా ఉంది యాస్మిన్. వాడు - ఎర్రతోలు కప్పుకున్న ఎలుగ్గొడ్డులా ఉన్నాడు. బట్టనెత్తి, బండ కళ్ళద్దాలు - పై వరుసలో ఓ పన్ను విరిగి వికృతంగా కన్పిస్తోంది. ఖాన్‌చాచా కన్నా ఐదారేళ్ళు పెద్దాడిలా ఉన్నాడు. యాస్మిన్ గొంతు కోయటానికి వధ్యశిలకు పిల్చుకెళ్తున్న తలారీలా ఉన్నాడు వాడు.

నెలరోజుల క్రితం నేను పని నుండి తిరిగొచ్చేప్పటికి ఖాన్‌చాచా వసారాలో మంచం వేసుకుని కూచుని ఉన్నాడు. అక్కడి వాతావరణం నాకు కొత్తగా, వింతగా అన్పించింది.

మెరిసిపోయే కొత్త షేర్వాణీ, పైజమా వేసుకుని మురిసిపోతూ కూచుని ఉన్నాడు ఖాన్‌చాచా. తలమీద రుమాలీ టోపీ - అతని పక్కన ఎర్రటి టేప్‌రికార్డర్ - అందులోంచి హిందీపాట విన్పిస్తోంది. ఖాన్‌చాచా పాన్ నముల్తూ దిలాసాగా కన్పించాడు.

"ఆదాబ్ చాచాజాన్-క్యాబాత్‌హై-ఖుషీగా కన్పిస్తున్నారు-లాటరీ ఏమైనా తగిలిందా" అని అడిగాను అతని లాటరీ టిక్కెట్ల పిచ్చిని గుర్తుకు తెచ్చుకుంటూ.

"అలాంటిదే అనుకో బేటా - మంచి అల్లుడు దొరకడం కూడా అదృష్టమేకదా. అల్లా దయ మా మీద ఉండబట్టే యాస్మిన్‌కి బంగారం లాంటి సంబంధం కుదిరింది. అల్లుడు దుబాయ్‌లో పండ్ల వ్యాపారం చేస్తాడు. బాగా ధనవంతుడు. ఈ డ్రెస్సూ, ఈ టేప్‌రికార్డరూ, పిల్లలకు బట్టలూ, యాస్మిన్‌కి ఖరీదైన రెండు జతల చుడీదార్లు, ఒక వాచీ, మెడలో గొలుసూ ఇవన్నీ అతనే పంపించాడు" ఖాన్‌చాచా మొహంలో ఆనందం నగ్నంగా నర్తించటం నాకు స్పష్టంగా కన్పించింది.

"మీరతన్ని చూశారా చాచాజాన్?" గుండెల్లో సుళ్ళు తిరుగుతున్న బాధను నొక్కి పెడుతూ అడిగాను.

"హోటల్లో దిగినాడని తెలిసి వెళ్ళి కల్సుకున్నాను - దబ్బపండు రంగులో ఉంటాడు తెలుసా?"

"వయసెంత ఉంటుంది?" బలపడుతోన్న అనుమానంతో అడిగాను.

"ఆ ఏమంత వయసనీ - మహా ఉంటే ముప్పయ్ ఉంటుందేమో. అయినా మగవాడి వయసు ముఖ్యంకాదుగా. అదేమైనా అడ్డంకా - నాకూ మీ చాచీకి పదేళ్ళపైనే వయసు తేడా లేదూ!" అన్నాడు తేలిగ్గా నవ్వేస్తూ.

నేను ఉదాసీనంగా అయిపోయాను. ఈ పెళ్ళికి ఒప్పుకోవద్దని యాస్మిన్‌తో చెప్పాలన్న ఆరాటం . . . యాస్మిన్‌ని ఎత్తుకెళ్ళి ఏ మసీదులోనో పెళ్ళి చేసుకోవాలన్న కోరిక . . . యాస్మిన్ నా మాట వింటుందా? మా అబ్బాజాన్ ఇష్టమే నా ఇష్టం అంటుంది. నాకు తెలుసు- చాలా మంది ముస్లిం ఆడపిల్లల్లానే యాస్మిన్‌లో చొరవ చూపే గుణం లేదు.

ఇంట్లోకెళ్ళాక అమ్మ చెప్పింది. "ఎవరో బ్రోకర్ ఈ సంబంధం కుదిర్చాడట. దుబాయ్ షేక్ హోటల్లో దిగితే ఖాన్‌చాచా వెళ్ళి వివరాలు కనుక్కొన్నాడట. మెహర్ కింద పాతిక వేలు, పెళ్ళి ఖర్చుల నిమిత్తం మరో పాతిక వేలూ ఇస్తానన్నాడట"

పాతిక వేలు . . . ఖాన్‌చాచాలాంటి, మాలాంటి పేదవాళ్ళకు పాతిక వేలు చాలా పెద్ద మొత్తమే.

జల్వా కూడా అయిపోయింది.

నిఖా జరిగాక అందరూ ఖాన్‌చాచాని కౌగిలించుకుని 'దామాద్ ముబారక్ హో' అంటూ శుభాకాంక్షలు తెలిపారు. నేను ఇంట్లో కెళ్ళిపోవటం వల్ల ముబారక్ చెప్పే అవకాశం దొరకలేదు. ఇప్పుడు ఖాన్‌చాచా వెలిగే మొహంతో నాకు ఎదురుపడ్డాడు. మనసులో రగులుతున్న బాధని దాచుకోటానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తూ ఖాన్‌చాచాతో 'జమాయీ ముబారక్‌హో చాచా' అన్నాను.

*****

యాస్మిన్ దుబాయ్ వెళ్ళి అప్పుడే రెండు నెలలైంది.

వెళ్ళే ముందు ప్రతివారం ఓ ఉత్తరం రాస్తానని వాళ్ళమ్మతో చెప్పి వెళ్ళిన యాస్మిన్ ఒక్క ఉత్తరమ్ముక్క కూడా రాయలేదు. ప్రతినెలా కొంత డబ్బు పంపిస్తానని ఖాన్‌చాచాకు వాదా చేసిన దుబాయ్ షేక్ నుంచి డబ్బూలేదు, కబురూ లేదు.

ఖాన్‌చాచా వాళ్ళింట్లో అందరూ దిగులు పెట్టుకున్నారు. ఖాన్‌చాచా అయితే కూతురి మీద బెంగతో సగమైపోయాడు. దుబాయ్ షేక్ ఇచ్చిన అడ్రసుకు ఈ రెండు నెలల్లో నా చేతే నాలుగు ఉత్తరాలు రాయించాడు. ఒక్కదానికీ సమాధానం రాలేదు. నాకైతే యాస్మిన్ క్షేమ సమాచారాలు తెలియక ప్రతిక్షణం నరకంలా అనిపిస్తోంది.

అన్యమనస్కంగానే పనికివెళ్లాను.

అక్కడా దుబాయ్ వెళ్ళే మన ఆడపిల్లల గురించే మిగతా పని వాళ్ళు చర్చించుకుంటున్నారు. లతీఫ్ వాళ్ళింటి పక్కనుండే గౌస్‌మియా డబ్బుకు ఆశపడి తన కూతుర్ని దుబాయ్ షేక్‌కి కట్టబెట్టాడట. ఆ అమ్మాయిని వాడు నానా యాతనలు పెట్టి, నరకం ఎలా ఉంటుందో చూపించాడట. ఆ బాధలు భరించలేక తన పేద తల్లిదండ్రులకు విషయం ఎలా చేరవేయాలో తెలీక ఆ అమ్మాయి ఆత్మహత్య చేసుకుందట. ఆ విషయం కూడా చనిపోయిన దాదాపు సంవత్సరానికి తెలిసిందట.

"అక్కడికి పెళ్ళి పేరుతో తీసుకెళ్ళినా పని మనుషులుగానే వాడుకుంటారట. వాళ్ళచేత నానా చాకిరి చేయిస్తారట. వాళ్ళను దేహవాంఛలు తీర్చే యంత్రాల్లా వాడుకోవటమే కాకుండా, వాళ్ళ స్నేహితుల కోరికలు కూడా తీర్చమని బలవంతం చేస్తారట" అన్నాడు లతీఫ్.

"ఇలా జరుగుతుందని తెలిసినా మనవాళ్ళు దుబాయ్ షేక్‌లకు మన ఆడపిల్లల్ని ఎందుకు కట్టబెడ్తున్నారూ?" అని అడిగాడు పదిహేనేళ్ళ సుభానీ.

"ఏం చేస్తారు చెప్పు – దారిద్ర్యం . . . ఆకలి . . . శక్తికి మించిన సంతానం . . . డబ్బు ఖర్చుపెట్టి ఆడపిల్లల నిఖా చేయలేని దీనస్థితి . . . షేక్‌లు ఇస్తామనే డబ్బుకి ఆశపడి నిఖాలు చేస్తున్నారు. ఓ రకంగా చెప్పాలంటే వేరే దారిలేక ఆడపిల్లల్ని అమ్ముకొంటున్నారు" అన్నాడు లతీఫ్. ఆ స్త్రీల దయనీయ స్థితిని తల్చుకుని అనుకుంటాను అతని కంఠం రుద్ధమయింది.

"వాళ్ళ దేశంలో మనకు మల్లే మెహబూబ్‌కి మెహందీలు ఉండవు. పని వాళ్ళకూ కొరతే. మన ఆడపిల్లలైతే చాలా చౌకగా దొరుకుతారు. ఇటు పనికీ అటు పడక్కీ వాడుకోవచ్చని ఇక్కడికొచ్చి నిఖాపేరుతో దర్జాగా దోచుకెళ్తున్నారు" అన్నాడు కసిగా అన్వర్.

నాకు యాస్మిన్ గుర్తొచ్చి వళ్ళు జలదరించింది. తలనొప్పిగా ఉందని చెప్పి ఇంటికెళ్ళి పడుకున్నాను. కలల్లో కూడా యాస్మిన్‌ని పలుపుతాడు మెడకుబిగించి లాక్కెళుతున్నట్లు . . . కొరడాలతో బాది గొడ్డుచాకిరీ చేయిస్తున్నట్లు . . . అన్నీ పీడకలలే.

అర్నెల్లు గడిచింది.. దుబాయ్‌నించి ఏ కబురూ లేదు. టెలిగ్రాములు పంపించాం. ప్రయోజనం లేదు. రిజిష్టర్ ఉత్తరం రాస్తే, అటువంటి అడ్రస్ లేదని తిరిగొచ్చింది.

ఖాన్‌చాచా మంచం పట్టాడు. దాదాపు పదినెలలు గడిచాయి. ఎవరయినా ఉద్యోగం కోసం దుబాయ్ వెళ్తున్నారని తెలిస్తే వెళ్ళి వాళ్ళ కాళ్ళూగడ్డాలు పట్టుకుని బతిమాలుకోవటం - తీరా వారి నుంచి ఎంత వెదికినా దుబాయ్‌లో అటువంటి వ్యక్తి దొరకలేదని ఉత్తరం వచ్చాక నిరాశతో కృంగిపోవటం నాకు అలవాటైపోయింది.

ఓ రోజు ఖాన్‌చాచా నాలుగో కొడుకు పరుగెత్తుకుంటూ వెల్డింగ్‌షాపుకొచ్చాడు.

యాస్మిన్ నుంచి ఉత్తరం వచ్చిందట. ఖాన్‌చాచా వాళ్లింట్లో ఉర్దూ చదవటం ఎవ్వరికీ రాదు. మా అమ్మకూ రాదు. అందుకే నన్ను వెంటనే పిల్చుకురమ్మని ఖాన్‌చాచా పంపించాడట.

నాకు గుండెల పైనుంచి కొండంత బరువు దిగిపోయినంత సంతోషం వేసింది. నా భయాలన్నీ ఉత్త దూదిపింజల్లా తేలి ఎగిరిపోయాయి. యాస్మిన్ చాలా ఉత్తమురాలు. ఆమె అమాయక మైన మొహం చూస్తే ఎవ్వరికీ మోసం చేయాలనో - దౌర్జన్యం చేయాలనో అన్పించదు.

ఆలోచనల్లోనే ఇంటికి చేరుకున్నాను.

ఖాన్‌చాచా మొహంలో ఒకప్పటి వెలుగు కనిపించింది. ఆ ఇంట్లో అందరిలో పెల్లుబుకుతున్న ఆనందం . . .

ఖాన్‌చాచా లేచి కూచుని ఉత్తరం నా చేతికిస్తూ "జల్దీ చదువు బేటా నా బేటి ఏం రాసిందో? తను ఖుషీగా ఉందటనా - ఈ బాబా ఇన్నాళ్ళూ గుర్తుకే రాలేదటనా-దామాద్ ఎలా ఉన్నాడట- నేను చెప్పలేదూ - అతను మంచి వాడేనని-వ్యాపారంలో తీరిక దొరికి ఉండదు" అన్నాడు.

వణికే చేతుల్తో ఉత్తరం విప్పదీశాను.

అందులో ఒకే ఒక వాక్యం రాసి ఉంది - దాన్ని పైకి చదివాను.

"అబ్బాజాన్ - మీకు ఆరో అల్లుడు ముబారక్ . . ."

చెట్టంత ఖాన్‌చాచాతో పాటు నేనూ కుప్పకూలిపోయాను.

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక - 10 మార్చి, 2000)*